క్లుప్తంగా

అమ్మపాలెంలో ప్రవేశాల పండగ



పిల్లలచే అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు

శృంగవరపుకోట: మండలంలోని అమ్మపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రవేశాల పండగ ప్రారంభమైంది. ఈ మేరకు బుధవారం పలువురు చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించి పాఠశాలలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు బి. రవిబాబు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌స్థాయి విద్య అందుతోందన్నారు. అలాగే అమ్మఒడి, విద్యాకాను, గోరుముద్ద, తదితర పథకాలు కూడా వర్తిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ జి.అప్పారావు, ఉపాధ్యాయులు టి.అప్పారావు, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నేడు వరి విత్తనాల పంపిణీ

దత్తిరాజేరు: స్థానిక రైతు భరోసా కేంద్రం(ఆర్బీకే)లో రైతులకు ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన వరి విత్తనాలను గురువారం రాయితీపై పంపిణీ చేయనున్నట్లు ఏఓ అనురాధ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి ఇతర ప్రజా ప్రతినిధులు అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈఈ ఆర్.శంకరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లను సరి చేయడంతో పాటు లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. దేవుపల్లి, బి.రాజేరు, చిన్నతామరాపల్లి, రుద్రపాలెం, గొల్లుపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే కడుబండికి వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏల సంఘం ప్రధాన కార్యదర్శి వెంకన్న

వేపాడ: వీఆర్‌ఏలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా వీఆర్‌ఏల సంఘం ప్రధాన కార్యదర్శి గట్టు వెంకన్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావును కోరారు. రామస్వామిపేటలో ఎమ్మెల్యేను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వెంకన్న మాట్లాడుతూ వీఆర్‌ఏలకు పేస్కేలు ఇప్పించాలని, 50 ఏళ్లు దాటిన వీఆర్‌ఏల వారసులకు ఉపాధికల్పించాలని, నామినీలను రెగ్యులర్ చేయాలని కోరారు. అలాగే రామస్వామిపేట గ్రామపరిధిలో ఉన్న క్వారీల్లో బ్లాస్టింగ్‌వల్ల ఇబ్బందులు పడుతున్నామని, ఇళ్ల బీటలు వారుతున్నాయని సర్పంచ్ వడ్డమాని శర్మతోపాటు సిద్ధాంతి నాగేశ్వరరావు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

పూజా సామగ్రి దుకాణం దగ్ధం

చీపురుపల్లిరూరల్: రామలింగాపురం-పుర్రేయవలస గ్రామాల మధ్య అయ్యప్ప సన్నిధానం, గ్రామదేవత బంగారమ్మ గుడి సమీపంలోని రామలింగాపురంనకు చెందిన బెవర తవిటినాయుడి పూజాసామగ్రి దుకాణం బుధవారం సాయంత్రం దగ్ధమైంది.స్థానికులు తెలిపిన వివరాలు..సమీపంలో చేపడుతున్న ఉపాధి హామీ పనుల వద్ద చెత్త, డొంకలకు వేతనదారులు నిప్పు పెట్టారని, గాలులు బాగా వీయడంతో నిప్పు రవ్వలు దుకాణంపై పడి ఈప్రమాదం జరిగిందని చెబుతున్నారు. ప్రమాదంలో కొబ్బరికాయలు,చీరలు,పూజా సామగ్రి కాలి బూడిదైంది.

సేవలే గుర్తింపునిస్తాయి



ఎంపీడీఓగా పదోన్నతి పొంది, బదిలీ అయిన సూర్యనారాయణను సన్మానిస్తున్న జెడ్పీటీసీ అప్పారావు,అధికారులు

వేపాడ: ఏ ఉద్యోగికి అయినా చేసిన సేవలే గుర్తింపునిస్తాయని జెడ్పీటీసీ ఎస్.అప్పారావు అన్నారు. మండల ఈఓపీఆర్డీగా పనిచేసిన సీహెచ్.సూర్యనారాయణ పదోన్నతిపై మక్కువ ఎంపీడీఓగా బదిలీఅయ్యారు. ఆయన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ బి.ఎస్.ఎస్.కె.పట్నాయక్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ సన్యాసినాయుడు, పంచాయతీరాజ్ ఏఈ ఆలీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దేవి, ఎంఈఓ జి.శ్రీదేవి, పంచాయతీకార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామస్వరాజ్యం

- గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య
- పెద్దమదుపాడలో సచివాలయం, కొర్లాంలో హెల్త్ క్లినిక్ భవనాల ప్రారంభం



పెద్దమదుపాడలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



కొర్లాంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గంట్యాడ: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నెలకొల్పిన గ్రామ సచివాలయ వ్యవస్థతో గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాకారమైందని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని పెదమదుపాడ గ్రామంలో సచివాలయం, కొర్లాంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ సేవలన్నీ సచివాలయాల ద్వారా గ్రామాల్లోనే అందుతుండడంతో ప్రజలకు మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన పనితప్పిందని అన్నారు. సచివాలయ సేవలపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. గతంలో వన్-బీలు, కుల, ఆదాయ ధ్రువీకరణ,తదితర పత్రాలు కావాలంటే మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేదని, ప్రస్తుతం ఇవన్నీ గ్రామాల్లోనే అందుతున్నాయని తెలిపారు. పంచాయతీ కార్యాలయాల వద్ద పింఛన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు పడిగాపులు కాసే పరిస్థితి గతంలో ఉండేదని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ దారులకు ఆ కష్టాలు తొలగిపోయాయని, గ్రామ వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తేదీన ఉదయాన్నే తలుపుతట్టి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్నారని చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం జగన్ పాటుపడుతున్నారని, విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో నాడు-నేడు పథకం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులతో ఎన్నో ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల రూపురేఖలు మారాయని వివరించారు. గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా ప్రజలకు వైద్యసేవలు మరింత చేరువయ్యాయని తెలిపారు. ప్రజల ఇళ్ల వద్దకే వైద్యాధికారి, సిబ్బంది వెళ్లి వైద్యసేవలు అందించడం కోసం ప్రభుత్వం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని ప్రారంభించిందని చెప్పారు. ఎంపీపీ పీరుబండి హైమావతి, జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, పెదమదుపాడ సర్పంచ్ కిలపర్తి శ్రీరామ్మూర్తి, ఎంపీటీసీ గొర్లె చిన్నిమ్మ, కొర్లాం సర్పంచ్ చప్ప వెంకటరమణమ్మ, ఎంపీటీసీ చప్ప ఊహ, వైయస్సార్‌సీపీ సీనియర్ నాయకులు నారాయణమూర్తిరాజు, గనివాడ సన్యాసినాయుడు, పంచాయతీరాజ్ జేఈ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు మార్కెట్ యార్డ్ ప్రారంభం

- రూ.2.5 కోట్లతో నిర్మించిన మార్కెట్ యార్డ్‌ను ప్రారంభించనున్న మంత్రి బొత్స
- జగనన్న ఆణిముత్యాలకు పురస్కారాల అందజేత



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

చీపురుపల్లి: చీపురుపల్లి నియోజకవర్గంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ గురువారం పర్యటించనున్నట్లు చీపురుపల్లి వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చీపురుపల్లి - గరివిడి పట్టణాల మధ్య ఏడెకరాల ప్రభుత్వ స్థలంలో రూ.2.5 కోట్లతో నిర్మించిన మోడల్ మార్కెట్ యార్డును గురువారం ఉదయం 10 గంటలకు మంత్రి బొత్స ప్రారంభిస్తారని చెప్పారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రూ.17.5 లక్షలతో నిర్మించనున్న డిజిటల్ లైబ్రరీ భవనానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అలాగే స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి జగనన్న ఆణిముత్యాల కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి,గుర్ల,మెరకముడిదాం మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల్లో ప్రథమ,ద్వితీయ,తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు పారితోషకం, మెడల్, ధ్రువీకరణ పత్రాలను ప్రభుత్వం తరఫున అందజేయనున్నట్లు చెప్పారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థుల తల్లి దండ్రులు హాజరు కావాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ దన్నాన జనార్ధనరావు, వైస్ చైర్మన్ సతివాడ అప్పారావు, నాయకులు బెల్లాన వంశీకృష్ణ, రఘుమండ త్రినాథ్, దాలయ్య, రమణమూర్తి పాల్గొన్నారు.

'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం ఏర్పాట్ల పరిశీలన

చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించనున్న నియోజకవర్గస్థాయి 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం ఏర్పాట్లను జిల్లా విద్యాశాఖాధికారి(డీఈఓ) లింగేశ్వరరెడ్డి బుధవారం పరిశీలించారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అతిథిగా హాజరవుతారని ఆయన చెప్పారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని హెచ్‌ఎం శ్రీనివాసరావుకు సూచించారు. ఆయన వెంట ఎంఈఓ ఎస్.భానుప్రకాష్, నాడు-నేడు జేఈ జాన్సన్ ఉన్నారు.

అన్నదాతలకు నాణ్యమైన విత్తనాలు

- ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



రైతులకు రాయితీపై వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: నియోజకవర్గ రైతులందరికీ నాణ్యమైన వరి విత్తనాలు అందిస్తామని స్థానిక ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ కార్యాలయంలో రైతులకు రాయితీపై వరి విత్తనాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలోని గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, గంట్యాడ, జామి మండలాల్లో 22,384 హెక్టార్లలో రైతులు వరి సాగు చేస్తున్నారని, ఆయా రైతులందరికీ 9,987 క్వింటాళ్ల విత్తనాలు అందించేందుకు ఏర్పాట్లు చేశామని చెప్పారు. అన్ని రైతుభరోసా కేంద్రాల్లో బీపీటీ 3291, బీపీటీ 5204, సోనామసూరి, స్వర్ణ, శ్రీధృతి, అమర, తదితర రకాల విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు నారాయణమూర్తి రాజు, ప్రభూజీ రాజు, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, వైస్ చైర్మన్ శ్రీనివాసరావు, గజపతినగరం, బొండపల్లి జెడ్పీటీసీ సభ్యులు గార తవుడు, రాపాక సూర్యప్రకాష్, నాయకులు బూడి వెంకటరావు, ఈదుబిల్లి కృష్ణ, చల్లా చల్లంనాయుడు, కరణం ఆదినారాయణ, సామంతుల పైడిరాజు, మండల సురేష్, మంత్రి అప్పలనాయుడు, లెంక గణేష్, దనాన త్రినాథ రావు, వ్యవసాయశాఖ గజపతినగరం డివిజన్ ఏడీఏ కె.మహరాజన్, ఎంపీడీఓ కిశోర్‌కుమార్, ఏఓ ధన లక్ష్మి, ఉద్యానవనశాఖ అధికారి రాజశేఖరం, తదితరులు పాల్గొన్నారు.

రూ. 9లక్షలతో అదనపు భవనాల నిర్మాణం



పూజలు చేసి భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ ప్రమీల, అధికారులు

గుర్ల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంపై అదనపు గదుల నిర్మాణ పనులను ఎంపీపీ పొట్నూరు ప్రమీల, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు బుధవారం పూజలు చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీడీఓ కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో పక్కనే ఉన్న సమావేశపు గదిపై అదనపు గదుల నిర్మాణానికి రూ. 9 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఎంపీడీఓ కల్యాణి, ఈఓపీఆర్డీ గాయత్రి, వైఎస్సార్‌సీపీ నాయకులు బెల్లాన బంగారునాయుడు, తోట తిరుపతిరావు, అంబల్ల చిన్నారావు, జమ్ము స్వామినాయుడు, కెంగువ మధుసూదనరావు, ఇజ్జిరోతు ప్రసాద్ ఉన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి



చీపురుపల్లి రూరల్: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



శృంగవరపుకోట : రక్తదానం చేస్తున్న దాతలు

చీపురుపల్లి రూరల్: యువత రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఆశయ సంస్థ అధ్యక్షుడు, ఇండియన్ రెడ్‌క్రాస్ బోర్డు మెంబర్ రెడ్డి రమణ పిలుపునిచ్చారు. గరివిడి ఎస్‌డీఎస్ కళాశాలలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. అనంతరం రక్తదానం చేస్తామని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.ప్రసన్నలక్ష్మి, పీడీ భానుమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

శృంగవరపుకోట: పట్టణంలో కొన్నేళ్లుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ 'స్నేహ' ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో 'చాగంటి రాజగోపాల్ జ్ఞాపకార్థం రక్తదాన శిబిరం నిర్వహించారు. తహసీల్దార్ డి. శ్రీనివాసరావు శిబిరాన్ని ప్రారంభించగా.. ఎస్సై లోవరాజు, డాక్టర్ మళ్ల వేణు సహా సుమారు 64 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో స్నేహ అధ్యక్ష, కార్యదర్శులు ఏఎస్ వెంకటరావు, మంథా సుబ్బారావు, బుగత వెంకటేశ్వరరావు, పి.వరలక్ష్మి, మురళి, మళ్ల రామకృష్ణ, అప్పలరాజు, రమేష్, ప్రకాశ్, శ్రీరామ్మూర్తి, శ్రీనివాసరావు, కె.శ్రీను, రాము, తిరుపతిరావు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యాకానుకల పంపిణీ



చీపురుపల్లి : విద్యార్థులకు విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న శ్రీనివాసనాయుడు



శృంగవరపుకోట: ధర్మవరం హైస్కూల్‌లో విద్యార్థులకు జామెట్రీ బాక్సుల పంపిణీ

చీపురుపల్లి: స్థానిక మేజర్ పంచాయతీ పరిధి రెడ్డిపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ మండల నాయకులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, తదితరులు జగనన్న విద్యాకానుక కిట్లను బుధవారం పంపిణీ చేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు కార్పొరేట్ తరహా విద్య అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని అన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

300 మంది విద్యార్థులకు జామెట్రీ బాక్సులు

శృంగవరపుకోట: ధర్మవరం ఉన్నత పాఠశాల, జూనియర్ బాలికల కళాశాల విద్యార్థుల కోసం రూ.25 వేల విలువ చేసే 300 జామెట్రీ బాక్సులను ఆ పాఠశాల పూర్వవిద్యార్థి మోడి రామునాయుడు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు శ్రీహర్ష సమకూర్చారు. హెచ్‌ఎం ఎస్.వెంకటరావు నేతృత్వంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో 8వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు బుధవారం వీటిని పంపిణీ చేశారు.పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ తగరంపూడి రమణ తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యం



వేపాడ: రామస్వామిపేటలో పథకాలను మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

వేపాడ: రాష్ట్రంలో పేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరచడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాలను అమలు చేస్తున్నారని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రామస్వామిపేటలో బుధవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వ హించారు. ఎమ్మెల్యే స్థానిక సర్పంచ్ వడ్లమాని శర్మ, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాన్ని వివరిస్తూ..ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. విద్య, వైద్యరంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పాలన చేస్తున్న సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఎంపీడీఓ బి.ఎస్.ఎస్.కె.పట్నాయక్, విద్యుత్‌శాఖ ఏఈ సూరిబాబు, వైస్ ఎంపీపీ దాయిరి ముత్యాలమ్మ, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ముమ్మలూరి జగ్గుబాబు, కె.జి.పూడి సర్పంచ్ బంగారయ్య, నాయకుడు ఎస్.వి.రమణ, పత్రి బాలకృష్ణ, ఎం.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమం

చీపురుపల్లి: పార్టీలకతీతంగా గడప గడపకూ సంక్షేమ పథకాలు అందించిన సీఎంగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ అన్నారు. బుధవారం సాయంత్రం చీపురుపల్లి సచివాలయం-2 పరిధి రామాంజనేయకాలనీలో 'గడప గడపకు మన ప్రభుత్వం' నిర్వహించా రు. అధికారులు, నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, కోరుకొండ దాలయ్య, ఇప్పిలి కృష్ణ, ఈఓపీఆర్డీ అన్నపూర్ణాదేవి, పంచాయతీ అధికారి ఝాన్సీ పాల్గొన్నారు.



చీపురుపల్లి: రామాంజనేయకాలనీలో పథకాలను వివరిస్తున్న ఎంపీపీ వెంకటనరసమ్మ, నాయకులు

నేడు డయల్ యువర్ డీఎం

శృంగవరపుకోట : ఎస్.కోట ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికుల ఇబ్బందులు, సమస్యలు తెలుసుకునేందుకు గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు డిపో మేనేజర్ కె.రమేష్ బుధవారం తెలిపారు. సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకూ ప్రయాణికులు 99592 25619 లేదా 73829 23679 నంబర్లకు ఫోన్ చేయవచ్చని సూచించారు.

రూ.4 లక్షలతో రచ్చబండ నిర్మాణం



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ వెంకటనరసమ్మ

చీపురుపల్లిరూరల్: మండలంలోని అలజంగి గ్రామంలోని ఎస్సీ కాలనీలో మండల పరిషత్ నిధులు రూ.4లక్షలతో చేపట్టనున్న రచ్చబండ నిర్మాణ పనులకు ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ బుధవారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు, సర్పంచ్ రఘుమండ త్రినాథ్, మాజీ ఎంపీటీసీ బవిరి రవిశంకర్, నాయకులు రేవల్ల సత్తిబాబు, చినరాములు, ప్రభాత్‌కుమార్, గురాన జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం



సీసీ రోడ్డు నిర్మిస్తున్న కార్మికులు

గజపతినగరం: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని గజపతినగరం సర్పంచ్,వైస్ సర్పంచ్‌లు నరవ కొండమ్మ, కర్రిరామునాయుడు తెలిపారు. మండల కేంద్రంలోని జయంతి కాలనీలో పంచాయతీ నిధులతో బుధవారం సీసీ రోడ్డును నిర్మించారు. రోడ్డు సమస్య తీరడంతో కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు



జామి: వేణుగోపాలస్వామి ఆలయంలో గ్రిల్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొత్స



శృంగవరపుకోట: వంట గదిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట: మండలంలోని తిమిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'నాడు - నేడు' నిధులు రూ. లక్షతో నిర్మించిన వంటగదిని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం సహకారంతో సర్కారు బడులు సర్వాంగ సుందరంగా తయారవుతున్నాయని చెప్పారు. నాణ్యమైన విద్య అందివ్వాలన్న ముఖ్యమంత్రి కలను సాకారం చేసేందుకు ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. అనంతరం గ్రామంలో శ్లాబ్‌కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుధారాజు, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి, సర్పంచ్ ఒబ్బిన త్రినాథమ్మ, ఎంపీటీసీ సభ్యుడు పి.ధర్మారావు, స్కూల్ కమిటీ చైర్మన్ ఒబ్బిన శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ గ్రిల్స్ ప్రారంభం..

జామి: మండలంలోని భీమసింగి వేణుగోపాలస్వామి ఆలయానికి అమర్చిన స్టీల్ గ్రిల్స్‌ను ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ప్రారంభించారు. అంతకుముందు అట్టాడ రామాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, డీసీసీబీ డైరెక్టర్ పాండ్రంకి సంజీవి, రాష్ట్ర గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ సీహెచ్ సత్యారావు, అట్టాడ, భీమసింగి సర్పంచ్‌లు అమ్మన్నదొర, జె.వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చేగువేరా జయంతి



చేగువేరా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాశాల అధ్యాపకులు

శృంగవరపుకోట: స్థానిక పుణ్యగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.కేశవరావు నేతృత్వంలో చరిత్ర విభాగం పర్యవేక్షణలో చేగువేరా జయంతిని బుధవారం నిర్వహించారు. చేగువేరా చిత్రపటానికి అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రపంచంలో ప్రజలందరికీ సమన్యాయం, స్వేచ్ఛ స్వాతంత్ర్యం, సమానత్వం అందించాలని కోరుకుని చేగువేరా తన తుదిశ్వాస వరకూ పోరాడారన్నారు. చరిత్ర ఉపన్యాసకులు సీహెచ్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రపంచంలో నియంతృత్వ, సైనిక, సామ్రాజ్యవాద, వలసపాలనకు వ్యతిరేకంగా ప్రజా ప్రభుత్వాలు ఏర్పాటు కావాలని దిశానిర్దేశం చేసిన వ్యక్తి చేగువేరా అని అన్నారు. ఉపన్యాసకులు డాక్టర్ రవీంద్రనాథ్, కె.వాసుదేవరావు, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.